క్లుప్తంగా

దేవరాపల్లిలో అన్న సమారాధన



దేవరాపల్లి గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో భాస్కరరావు, గ్రామ పెద్దలు.

దేవరాపల్లి: గౌరీ పరమేశ్వర్ల మహోత్సవంలో భాగంగా మండల కేంద్రం దేవరాపల్లి రామాలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గౌరీ పరమేశ్వర్ల యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు వడ్డన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వర్లను కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. వరదపురెడ్డి లలితానాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ తదితరులు దర్శించుకుని, పూజలు చేశారు.

ఆస్తమా రోగులు జాగ్రత్తలు పాటించాలి



వైద్య పరీక్షలను చేస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: చలికాలంలో ఆస్తమా వ్యాధిగ్రస్తులు వైద్యులు చెప్పిన జాగ్రత్తలను పాటించాలని వైద్యాధికారి బి.సుబ్రహ్మణ్యం సూచించారు. ఆర్లి గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్య సేవలు అందించారు. 139 మందికి వైద్య పరీక్షలు, 34 మందికి రక్తపరీక్షలను జరిపారు. గర్భిణులకు తనిఖీలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజే పురంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

మాడుగుల రూరల్: జన జాతీయ గౌరవ్ దివస్, వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం కె.జె.పురం 2వ సచివాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను స్థానిక ఎంపీడీవో పీఎస్ఎల్వీ మీనాకుమారి వివరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్ పథకంతో గ్రామంలో రూ.3.30 కోట్లు వెచ్చించి, ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సర్పంచ్ జామి రమణబాబు మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు ఖీశెట్టి శ్రీనివాసరావు, లోవతల్లితో పాటు స్థానిక పీఏసీఎస్ అధ్యక్షులు కాళ్ల రాము, మళ్ల కన్నబాబు, ఆడారి కన్నారావు, ఎం.వి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికార్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు రేపు



కేజే పురం దుర్గాలమ్మ

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామంలో దుర్గాలమ్మకు శనివారం పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలమరశెట్టి చిట్టినాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామ ప్రజలు హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, నాగేశ్వరరావు

రావికమతం: మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం గురువారం ఎన్నికయింది. మండల శాఖ అధ్యక్షుడిగా పోలిన అప్పారావు, కార్యదర్శిగా గెంజి నాగేశ్వరరావును సభ్యులు ఎన్నుకున్నారు. గురువారం రావికమతంలో జిల్లా కార్యదర్శి కాళింగ సతీష్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. వీరితో పాటు సంఘ గౌరవాధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షులుగా సీహెచ్ దుర్గాలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా వేపాడ సత్యనారాయణ ఎన్నికయ్యారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న ఆసరా



ఈమె పేరు కర్రి లక్ష్మి. దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి పేద కుటుంబం ఈమెది. భర్త స్వామిరాజుకు ఉన్న చిన్నపాటి బట్టల షాపుతో వచ్చే అరకొర ఆదాయంతోనే కుటుంబ జీవనం. చైతన్య డ్వాక్రా సంఘం సభ్యురాలు. సీఎం జగన్ ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అందిన సొమ్ముతో ఆ చిన్న షాపును రెడీమేడ్ దుకాణంగా తీర్చిదిద్దారు. దీంతో పాటు మండల సమాఖ్యలో స్త్రీనిధి, సీఐఎఫ్ ద్వారా లోన్లు తీసుకుని అదే షాపులో ఇంటర్నెట్, జెరాక్స్ మిషన్ ఏర్పాటు చేసుకున్నారు. భర్త, భార్యతో పాటు కుమారుడు, కుమార్తె సైతం షాపు నిర్వహణలో సహకరిస్తున్నారు. షాపు ద్వారా వచ్చే ఆదాయంతో తీసుకున్న రుణాలు తీర్చేయడంతో పాటు, కొంత మేర ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. తమను ఆదుకున్న సీఎం జగన్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని లక్ష్మి ఆనందంగా చెప్పింది.



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అక్కచెల్లెమ్మలు



గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలనతో పాటు గ్రామ స్థాయిలో ఉత్పాదకత, వనరుల పెంపుదలే ధ్యేయంగా వైఎస్సార్ ఆసరా పథకానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వంలో స్వయం సహాయక బృందా(డ్వాక్రా)లు తీసుకున్న రుణ బకాయిలను నాలుగు వాయిదాల్లో బ్యాంకులకు చెల్లిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇప్పటికే మూడు వాయిదాలు చెల్లించారు. మిగిలిన వాయిదాను జనవరిలో చెల్లించనున్నారు.

దేవరాపల్లి మండలంలో వైఎస్సార్ ఆసరా వివరాలు

విడత	గ్రూపులు	సభ్యులు	నిధుల జమ
తొలి విడత	993	10,216	రూ.5.26 కోట్లు
రెండో విడత	998	10,268	రూ.5.32 కోట్లు
మూడో విడత	998	10,268	రూ.5.32 కోట్లు

డ్వాక్రా రుణ బాధల నుంచి విముక్తి

మూడు విడతల్లో రూ.15.90 కోట్లు జమ

తోబుట్టువులా ఆదుకుంటున్నారని మహిళల హర్షం



దేవరాపల్లిలో పొదుపు సంఘాల సభ్యుల వేలి ముద్రలు సేకరిస్తున్న వెలుగు సిబ్బంది

దేవరాపల్లి: అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా ఎదగాలి. వారి కుటుంబాలకు ఆసరాగా నిలవాలి. ఆ లక్ష్యంతోనే సీఎం జగన్ మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. దాదాపు సంక్షేమ పథకాలన్నింటినీ వారి పేరిటే అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డ్వాక్రా రుణ మాఫీ పేరిట బూటకపు హామీలతో డ్వాక్రా మహిళల్ని మోసపుచ్చారు. వారికి అండగా ఉంటానంటూ గత ఎన్నికల్లో హామీ మేరకు, 2019 ఏప్రిల్ 11 నాటికి తీసుకున్న డ్వాక్రా రుణాల మాఫీకి సీఎం జగన్ నడుంబిగించారు. నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని ఇచ్చిన హామీ మేరకు, వైఎస్సార్ ఆసరా పేరిట ఇప్పటికే మూడు విడతల నిధులు వారి ఖాతాల్లో జమ చేశారు. కొత్త సంవత్సరంలో మొదటి నెలలో చివరి విడత నిధుల్ని కూడా జమ చేసేందుకు సన్నద్ధమయ్యారు.



నా పేరు గనివాడ ఆదిలక్ష్మి. మాది దేవరాపల్లి మండలం వెంకటరాజుపురం. భర్త వీర్రాజు కార్పెంటర్. మాకు ముగ్గురు ఆడపిల్లలు. ఫర్నిచర్ తయారీలో కర్ర/చెక్కను ముక్కలు చేసేందుకు కటింగ్ మిషన్ వద్దకు తీసుకెళ్లాలి. ఫర్నిచర్ తయారీలో వచ్చే మొత్తం నగం సామిల్లు యజమానికే చెల్లించాలి. ముగ్గురు ఆడ పిల్లలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడ్డాం. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక మా కష్టాలు తప్పాయి. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడు విడతల్లో 60 వేలు, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750, రైతు భరోసాలో రూ.13,500 వచ్చాయి. వీటిని జాగ్రత్త చేసి చెక్కలు కోసే యంత్రాన్ని కొనుగోలు చేయాలనుకున్నాం. ఆ నిధులతోపాటు స్త్రీనిధి నుంచి రూ.50 వేలు రుణం తీసుకుని మిషన్ కొనుక్కున్నాం. సామిల్లుకు వెళ్లాల్సిన పనిలేకుండా ఇంటి వద్దే చెక్కలు కటింగ్ చేస్తున్నాం. జగనన్న చేసిన మేలును మర్చిపోలేము.

డైలీ ఫైనాన్స్ తిప్పల్లేవు



నా భర్త వీరపాత్రుడు దివ్యాంగుడు. జీవనం కోసం చిన్నపాటి కూరగాయల వ్యాపారం చేస్తున్నాం. పెట్టుబడి కోసం రోజువారీ ఫైనాన్స్ తీసుకునేవాళ్లం. వచ్చిన డబ్బుల్లో ఫైనాన్స్ కట్టగా, కుటుంబ పోషణకు కూడా సరిపడేది కాదు. సీఎం జగన్ ఇచ్చిన ఆసరా నిధులు రూ.40,224లతో వ్యాపారాన్ని విస్తరించాం. డైలీ ఫైనాన్స్ ఇబ్బందుల్లేకపోవడంతో వచ్చిన ఆదాయంతో చిన్నచిన్న అప్పుల నుంచి బయటపడ్డాం. సొంతంగా ఎదిగేందుకు ఆసరాగా నిలిచిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– కర్రి రాణి, డ్వాక్రా మహిళ, దేవరాపల్లి

చిరు వ్యాపారాలకు ఆసరా



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలు మహిళల ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటి ద్వారా వచ్చిన నగదుతో పాటు కొంత రుణాన్ని తీసుకుని స్వయం ఉపాధి యూనిట్లు, చిరు వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దేవరాపల్లి మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడు విడతల్లో రూ.15.90 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేశాం.

– ఎస్.ప్రభాకర్, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, దేవరాపల్లి

బీసీ సంక్షేమానికి సీఎం జగన్ కృషి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: బీసీల సంక్షేమం కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వారిని అన్ని విధాలా ఆదుకున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక పాత రామమందిరం వద్దనున్న కల్యాణమండపం అవరణలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని పార్టీ మండలశాఖ అధ్యక్షుడు బటు వెంకటరమణ గురువారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న జగన్ కోసం బీసీలు సైనికుల్లా పనిచేసి, మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుని రుణం తీర్చుకోవాలన్నారు. ఈ నెల 5న వడ్డాదిలో నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రకు పెద్ద ఎత్తున తరలిరావాల్సిందిగా విప్ ధర్మశ్రీతోపాటు, నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు పిలుపునిచ్చారు. వడ్డాది జంక్షన్లో జరిగే సమావేశానికి ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ముఖ్య నాయకులు హాజరై, ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు గొర్లె వెంకటరమణ, మండల కన్వీనర్ మద్దు అప్పలనాయుడు, స్టేట్ కొప్పుల వెలమ డైరెక్టర్ టీవీ రమణ, పార్టీ సీనియర్ నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, శెట్టి సత్యన్నారాయణ, మలసాల భాస్కరరావు, ఉలబాల రాము తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి కోరారు. నర్సీపట్నం మండలం, యరకన్నపాలెం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న 13 రకాల పథకాలను సద్వినియోగం చేసుకుని, దేశాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమాధవి, సర్పంచ్ నారాయణమ్మ, వైస్ సర్పంచ్ సుర్ల చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పాన్ని నెరవేర్చాలి



దేవరాపల్లిలో చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న కిలపర్తి భాస్కరరావు

దేవరాపల్లి: జగనన్న స్వచ్ఛ సంకల్పం ఆశయాన్ని నెరవేర్చేందుకు ప్రజలు సహకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు అన్నారు. దేవరాపల్లి సచివాలయంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మతో కలిసి స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా సరఫరా చేసిన తడి, పొడి చెత్త సేకరణకు బుట్టలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సాధ్యపడుతుందన్నారు. ఇళ్లలో తడి, పొడి చెత్తలను వేరు చేసి సిబ్బందికి అందించి, సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కోఆపరేటివ్ డైరెక్టర్ వరదపురెడ్డి లలితానాయుడు, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, ఇట్లా వెంకటపతి, వార్డు మెంబర్లు గాలి సూర్యలక్ష్మి, దీవి శంకర్, వాలేటి నాగరాజు, పంచాయతీ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంటలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు గురువారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

బిందు సేద్యం రాయితీని వినియోగించుకోండి



మాట్లాడుతున్న పతంజలి ఏజీఎం పట్టాభిరామిరెడ్డి

రోలుగుంట: ప్రభుత్వం ఇస్తున్న బిందు సేద్యం రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఏజీఎం వి.పట్టాభిరామిరెడ్డి రైతులను కోరారు. కె.నాయుడుపాలెంలో పతంజలి సంస్థ, ఉద్యానశాఖ అధికారులు పామాయిల్ పెంపకం, ప్రభుత్వ రాయితీల వినియోగంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి ఎస్.శిరీష, పతంజలి సంస్థ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



కుంకుమ పూజ, లక్ష బిల్వార్చనలో భక్తులు

మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, కుంకుమ పూజలు వైభవంగా జరిగాయి. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పెద్ద మిల్లు జంక్షన్‌లో ఉన్న స్వయంభూ వామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా పాల్గొన్నారు. రాత్రికి ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు. శాస్త్రోక్తంగా జరిగిన పూజల్లో ఆలయ అర్చకులు దొరబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ



తూటిపాలలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నాయకులు



జేడీ పేటలో అభివృద్ధి వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్



కొరువాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్



జానకిరాంపురంలో సంక్షేమ లబ్ధి ఫ్లెక్సీ ఆవిష్కరణలో నాయకులు



మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి



కలిగొట్లలో సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేస్తున్న కర్రి సత్యం, బూరె బాబూరావు

చీడికాడ: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా సీఎం జగన్ పాలన సాగుతోందని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని తురువోలు సచివాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, సర్పంచ్ మట్టా అప్పారావుతో కలిసి నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరం రెడ్డి సూర్యనారాయణ, సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, పీఏసీఎస్ అధ్యక్షుడు నందారపు రమణబాబు ప్రసంగించారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, పార్టీ నేతలు లాలం శివకుమార్, పీటీ బాబు, బలిజి దేముళ్లు, జేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, సచివాలయ కన్వీనర్ చిటికెల రమణ కోరారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం తూటిపాలలో నిర్వహించారు. సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి, అభివృద్ధి, సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, సర్పంచ్‌లు గవిరెడ్డి ప్రసాదరావు, బుద్ధా రమణ, ఎంపీటీసీ సభ్యురాలు రుత్తల సత్యవతి, నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధిని సీఎం జగన్ ప్రభుత్వం అందిస్తున్నట్లు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. కొరువాడ గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొని, సీఎం జగన్ పాలనలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ లబ్ధి వివరాలను తెలిపే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేయడంలో లంచం అన్న మాటే లేకుండా పారదర్శకంగా లబ్ధిని అందించామన్నారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, జేసీఎస్ కన్వీనర్ రాజేష్, విఆర్వో పి.శంకరరావు, పంచాయతీ కార్యదర్శి ధర్మ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తాళ్లపు రెడ్డి వెంకటరాజారామ్ ఆధ్వర్యంలో మండలంలోని జేడీ పేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామ పరిధిలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన ఫ్లెక్సీని, పార్టీ జెండాను ఆవిష్కరించారు. గత నాలుగున్నరేళ్లలో చేపట్టిన, అభివృద్ధి సంక్షేమాన్ని గణాంకాలతో సహా వివరించారు. సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు గోపాలరాజు, పార్టీ నాయకులు పర్రె రామునాయుడు, పంచాయతీ కార్యదర్శి రమేష్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం: మండలంలోని పీకే గూడెం సచివాలయంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య పాలనలో వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లగుడు నాగేశ్వరరావు వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి వరహాలబాబు, డైరెక్టర్ అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు దేవిరమేష్, పి.జగ్గంపేట సర్పంచ్ జివి రెడ్డి సోమన్నదొర, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిరుసుపల్లి నర్సింగరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, జిల్లా కార్యదర్శి వెంకునాయుడు, కార్యవర్గ సభ్యులు ఉలబాల శ్రీనువాస్, సర్పంచ్‌లు వెంకటరమణ, కాళ్ల సత్యనారాయణ ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ పాల్గొన్నారు.

రోలుగుంట: అభివృద్ధితోపాటు అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పరిపాలిస్తున్నారని, మళ్లీ జగన్‌నే సీఎంను చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ లుగడు కృష్ణంనాయుడు కోరారు. జానకిరాంపురంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టీవీ రమణ పాల్గొన్నారు.

గొలుగొండ: ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యన్నారాయణ అన్నారు. రావణాపల్లి గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ సత్యన్నారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, కొమిర, పుత్తడిగైరంపేట సర్పంచ్‌లు రాజుబాబు, రమణ పాల్గొన్నారు.

దేవరాపల్లి: నవరత్నాల సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చిన జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం కోరారు. కలిగొట్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గొర్రుపోటు సుధారాణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావుతో కలిసి ఆవిష్కరించారు. రాత్రికి అక్కడే భోజనం చేసి పల్లె నిద్ర చేశారు. ఎంపీటీసీ రుత్తల వరలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామారావు, మాజీ ఎంపీటీసీ కొండబాబు, రుత్తల రాంబాబు, ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, యువజన అధ్యక్షుడు సూరినాయుడు, జేసీఎస్ కన్వీనర్ కేవీ రమణ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీవైఈవో అప్పారావు

నర్సీపట్నం/రోలుగుంట: చదువులో బాగా వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు సూచించారు. తురకబడి, బుచ్చింపేట జెడ్పీ హైస్కూళ్లను సందర్శించారు. తురకబడిలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్ సమావేశాన్ని గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. టెన్త్ విద్యార్థులపై ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షా విధానం, జేవీకే కిట్స్, యాప్స్ వినియోగంపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. బుచ్చింపేట హెచ్ఎం శేఖర్‌తో మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని పాఠశాల హెచ్ఎం కె.వి.రమణ, ఉపాధ్యాయులు సన్మానించారు.